క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో విద్యార్థులకు గేమింగ్ డిజైన్ విధానంపై ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్టు డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గేమింగ్ రంగంలో వినియోగించే బిల్డ్‌బాక్స్ అనే సాధనంతో అప్లికేషన్స్ డిజైన్ చేయించడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, డీన్ డోలా సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గండేపల్లి: గ్రామంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. తిరుమలాయపాలెంలోని శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, ప్రిన్సిపాల్ డి.సునీత నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కాకినాడకు చెందిన అంజు అంతర్జాతీయ కంటి ఆసుపత్రి వైద్యులు కళాశాలలోని 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఆసుపత్రి వైద్యురాలు లత ఆధ్వర్యంలో సిబ్బంది సూర్యనారాయణ, ప్రదీప్, విద్యాసాగర్, బాలస్వామి, జయ, చక్రధర్ విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. అనంతరం కంటిచూపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లడ్డూ వివాదంపై విచారణ జరిపించాలి

తుని రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం వివాదంపై సమగ్ర విచారణ జరిపించాలని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదంతో వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి విచారణ జరిపించి భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని కోరారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం: తిరుమల తిరుపతి దేవస్థానంలోని లడ్డూ ప్రసాదం వివాదంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం పట్టణంలో ఆందోళన చేశారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ సంస్థలైన మాతృశక్తి, దుర్గావాహిని సభ్యుల ఆధ్వర్యంలో ఆందోళన చేసి నిరసన తెలిపారు.

ఘనంగా 'గురజాడ' జయంతి

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మెహర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్య రంగానికి గురజాడ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీవీ కృష్ణారావు, జె.శ్రీనుబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న 13 మంది అరెస్ట్

కిర్లంపూడి: కోడి పందేలు ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని వేలంకలో కోడి పందేలు ఆడుతున్నట్టు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో శనివారం తెల్లవారుజామున స్థానిక ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో కోడి పందేల శిబిరంపై దాడి చేశారు. 13 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.14,180, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అన్నదాతా మేలుకో !

- ఈ-పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు
- రేపటితో ముగుస్తున్న గడువు
- ఇప్పటివరకూ 71.40 శాతం నమోదు పూర్తి



సీతారాంపురంలో రైతులకు ఈ-కేవైసీ చేస్తున్న ఏఓ నరసింహ

తుని రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ఈ-క్రాప్ బుకింగ్ (ఈ-పంట నమోదు) చేయడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రక్రియ ఖరీఫ్, రబీ సీజన్లలో కొనసాగుతుంది. 2024 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ఈ నెల 15తో పంట నమోదు ప్రక్రియ ముగిసినప్పటికీ ఇటీవల వచ్చిన వరదల కారణంగా ప్రభుత్వం ఈ నెల 23 వరకు గడువు పొడిగించినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. గడువు పొడిగింపుతో మెట్ట ప్రాంత రైతులకు స్వల్ప ప్రయోజనం చేకూరనుంది. సాగునీటి వసతులు లేని మెట్ట రైతుల ప్రతి సంవత్సరం ఆలస్యంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఖరీఫ్ నాట్లు వేస్తుంటారు. దాంతో కొంతమంది రైతుల ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీంతో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలను నష్ట పోతున్నారు. ఈ-క్రాప్ నమోదుకు గడువు పొడిగింపుతో రైతులకు కొంత ఊరట లభించనుంది. మెట్ట ప్రాంతంలో ఇంకా నాట్లు వేస్తుండడంతో ఈ-క్రాప్, ఈ-కేవైసీ గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

మండలాల వారీగా రైతులు, ఈ-పంట నమోదు వివరాలు

మండలం	రైతుల సంఖ్య	పంట నమోదు	విస్తీర్ణం(ఎకరాల్లో)	ఈ-కేవైసీ
తుని	12,496	28,786	21,937	71 శాతం
తొండంగి	8,771	16,657	17,734	76 శాతం
కోటనందూరు	9,753	22,462	15,172	72 శాతం
రౌతులపూడి	8,933	16,940	16,973	70 శాతం
శంఖవరం	3,863	7,932	10,356	69 శాతం
గండేపల్లి	7,014	15,547	19,806	63 శాతం
జగ్గంపేట	7,994	17,656	18,309	76 శాతం
ప్రత్తిపాడు	8,640	14,853	18,775	70 శాతం
ఏలేశ్వరం	4,240	9,978	9,384	76 శాతం
కిర్లంపూడి	9,119	15,632	12,931	71 శాతం
మొత్తం	80,823	16,6443	16,1377	

1,61,377 ఎకరాల్లో ఈక్రాప్ బుకింగ్ పూర్తి

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో పది మండలాల్లో 80,823 మంది రైతులకు చెందిన 1,61,377 ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయ్యింది. ఈ-క్రాప్ బుకింగ్ చేసిన రైతులకు ఈ-కేవైసీ చేయడం తప్పనిసరి. పది మండలాల్లో సరాసరిగా 71.40 శాతం ఈ-కేవైసీ పూర్తయ్యింది. ఇంకా 28.60 శాతం ఈ-కేవైసీ పూర్తికావలసి ఉంది. ఈ ప్రక్రియ గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతోంది. రైతుల వద్దకే వ్యవసాయ అధికారులు వెళ్లి ఈ-కేవైసీ చేస్తున్నారు.

ఈ-క్రాప్‌తో నమోదు చేయకపోతే నష్టమే

ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ చేయించుకోకపోతే రైతులు అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులతో పండిచిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయదు. అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంట నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించదు. అలాగే ప్రభుత్వం నుంచి రైతులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు లభించవు. రైతు భరోసా, పీఎం కిసాన్, పంటల బీమా, యాంత్రీకరణ రాయితీలు కోల్పోవలసి వస్తుంది. ఈ-క్రాప్, ఈ-కేవైసీతో ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు పంటను విక్రయించుకోవచ్చు. బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించుకునే వెసులుబాటు లభిస్తుంది.

ఈ-కేవైసీ తప్పనిసరి



పంట వేసినట్టు నిర్ధారించేందుకు ప్రతి రైతు బయోమెట్రిక్‌తో ఈ-కేవైసీ చేయించుకోవాలి. పంట నమోదు చేసిన తర్వాత ఈ-కేవైసీ చేస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు రైతులకు లభిస్తాయి. ఏఓలు, వీఏఏలు గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం గడువు పొడిగిస్తే రైతులకు తెలియజేస్తాం. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో ఇప్పటివరకు 71.60 శాతం ఈ-కేవైసీ పూర్తయ్యింది. మిగిలిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

కిర్లంపూడి: మండలంలోని పంట నమోదు చేయించుకున్న రైతులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ జోకా అమృత శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 23వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా లభించే సబ్సిడీ, క్రాప్ ఇన్సురెన్సు, సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర వర్తిస్తాయని తెలిపారు.

బస్సు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కిర్లంపూడి: బస్సు ఢీకొని గుర్తు తెలియని 60 ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... శనివారం తెల్లవారుజామున విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ట్రావెల్ బస్సు అదుపుతప్పి కృష్ణవరం టోల్‌గేట్ సమీపంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న గుర్తు తెలియని వృద్ధుడుని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే వృద్ధుడు మరణించాడు. స్థానిక వీఆర్వో యు.వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ధర్మవరంలో స్వచ్ఛతా హి సేవ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శనివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు పచ్చదనం, పరిశుభ్రత అనే నినాదంలో గ్రామంలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కార్యదర్శి నక్క శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రామకుర్తి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



ఏలేశ్వరంలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ఏలేశ్వరం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల్లో అవినీతికి పాల్పడితే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. 2023–24 ఏడాదికి గాను 563 పనులకు రూ.8,28,07,405 ఖర్చు చేశారు. వాటిలో అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ.5,12,362 రికవరీ చేసి రూ.10 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. అవినీతికి పాల్పడిన మేట్లపై విచారణకు అదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరంలో..

శంఖవరం: గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సోషల్ ఆడిట్ కో ఆర్డినేటర్ పి.సింహాద్రి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలతో శనివారం సమావేశం నిర్వహించారు. సోషల్ ఆడిట్‌కు సహకరించాలని ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంపీడీఓ శివ రామకృష్ణ, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు

గోకవరం: మండలంలోని కామరాజుపేట, వెదురుపాక, మల్లవరం, తిరుమలాయపాలెం గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 మధ్య కాలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కొలతల్లో వ్యత్యాసాలు, మస్టర్ల కొట్టివేతలు, దిద్దుబాట్లు వంటి అంశాలు గుర్తించినట్టు ఎస్ఆర్పీ తులసీనాయక్ తెలిపారు. ఈ నెల 24న గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని ఉపాధి ఏపీఓ శేషఅప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగం పరిశీలన



సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం: సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శనివారం పరిశీలించారు. స్వామివారి ప్రసాదంలో ఉపయోగించే నెయ్యి, ఇతర ముడిసరకుల నాణ్యత, కొనుగోలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెండర్ ద్వారా నెయ్యి కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. నెయ్యి నాణ్యతకు సంబంధించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ల్యాబొరేటరీ సర్టిఫికెట్ ఉంటేనే దేవస్థానం అనుమతిస్తుందని, లేకపోతే వెనక్కి పంపించేస్తామని అధికారులు వివరించారు. కాగా గత రెండేళ్లుగా నెయ్యి సరఫరా టెండర్ ఒకే డెయిరీ కంపెనీ చేజిక్కించుకోవడం, నెయ్యి నాణ్యతపై విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

గండేపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మురారిలో శనివారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రుణాలపై ఏపీఎం సన్యాసిరావును ఆరా తీశారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, రాయితీ, వడ్డీ తదితర విషయాలను డ్వాక్రా మహిళలకు తెలియజేయాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యే సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు మారిశెట్టి భద్రం, యర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.

గజ్జనపూడిలో ప్రజావేదిక

ప్రత్తిపాడు రూరల్: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మండలంలోని గజ్జనపూడిలో శనివారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుత గ్రామ కూడలిలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కిర్లంపూడి: మహిళలు, బాలల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. గెద్దనాపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై మానవ మృగాలు లైంగిక దాడులు చేయడం సిగ్గు చేటు అన్నారు. అటువంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిని శిక్షించేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, జీఎంఎస్‌కే మీనాక్షి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం

తుని రూరల్: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వేసవిని తలపించేలా ఎండ కాయడంతో ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో మెట్ట ప్రాంత వరి పైర్లకు ఊరట లభించింది. ఎస్.అన్నవరం శివారులో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం



తునిలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తుని: సమతుల్య పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. స్థానిక నాల్గో వార్డులో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తుందన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే బాలసంజీవని కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరో సీడీపీఓ నిహారిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు జంక్ ఫుడ్‌కు తీసుకోకూడదన్నారు. ఆకుకూరలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పలువురు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

కోటనందూరు: దళితుల హక్కులను హరించే ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని మాలమహానాడు జాతీయ ఉద్యమ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్త ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం ఎస్సీ వర్గీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ వర్గీకరణతో దళితుల్లో అన్ని వర్గాలవారు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. దళితులకు ఏమాత్రం ఉపయోగం లేని వర్గీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఆపాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత ప్రతినిధులు దారకొండ జోగిరాజు, జిగటాల వీరబాబు, జిగటాల కోటసత్తిబాబు, మేడికొండ సూకరాజు, కె.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే లడ్డూ వివాదం

- వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం



ఒమ్మి రఘురాం (ఫైల్)

జగ్గంపేట: ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు తిరుపతి వేంకటేశ్వరస్వామిని వాడుకొంటున్నారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. చంద్రబాబు నీచరాజకీయానికి కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని వివాదంలోకి లాగడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలనలో ఘోరంగా విఫలమైందన్నారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని కూడా చంద్రబాబు అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల నుంచి నిరసన రాకుండా వారి దృష్టిని మళ్లించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చారన్నారు. తిరుపతి లడ్డూపై చంద్రబాబు చేసిన ఆరోపణలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దీనిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని, తప్పు జరిగితే నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులు

గోకవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మండలంలోని కొత్తపల్లి ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జగ్గంపేట మండల రాజపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బ్యాడ్మింటన్ అండర్–14 విభాగంలో దుర్గాప్రసాద్, అండర్–17 విభాగంలో రాజ్‌కుమార్, చదరంగం అండర్–14 విభాగంలో భరత్‌చంద్ర, కబడ్డీ అండర్–17 విభాగంలో పవీణ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, పీఈటీ రవి తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ పి.నాగమణి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

స్కూల్‌గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

అన్నవరం: ప్రత్తిపాడు నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు శంఖవరం మండలం నుంచి పాల్గొనే బ్యాట్మింటన్ టీమ్‌లను ఎంపిక చేసినట్లు శనివారం దేవస్థానం హైస్కూల్ పీఈటీ పర్వత వీరేష్ తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్టు తెలిపారు. దేవస్థానం హైస్కూల్ హెచ్ఎం అల్లాడ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజపూడిలో..

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో శనివారం నియోజవర్గస్థాయి బాలుర స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించారు. గోకవరం, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట మండలాలకు చెందిన 30 పాఠశాలల నుండి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా... వెళ్లి రావయ్యా...

- వైభవంగా వినాయక నిమజ్జనాలు
- ఊరేగింపులో సందడి చేసిన యువత



గోకవరంలో భారీ గణపతి విగ్రహం ఊరేగింపు

తుని: వినాయక చవితి ఉత్సవాలు ముగిశాయి. స్థానిక దొబీఘాట్ తాండవ నదిలో ఏర్పాటు చేసిన ర్యాంపు వద్ద శనివారం పట్టణంలో వివిధ ప్రాంతాలకు చెందిన గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఉంచి మేళతాళాలతో ఊరేంగిపు నిర్వహించారు. మున్సిపల్, పోలీస్‌శాఖలు సంయుక్తంగా నిమజ్జన వేడుకులను పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీలకు సూచనలు చేశామని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని 90 శాతం మేర నిమజ్జనాలు ముగిశాయని చెప్పారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగియడంతో వినాయక విగ్రహాల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. స్థానిక పల్లపువీధిలో నెలకొల్పిన గణపతి విగ్రహాన్ని శనివారం తీన్‌మార్, బ్యాండ్‌మేళం, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక మెయిన్ రోడ్డు, బాలాజీ చౌక్, మార్కెట్ రోడ్డు, పల్లపువీధి మీదుగా సాగిన ఊరేగింపులో యువకులు సందడి చేశారు.

సంకటహర చతుర్థి వేడుకలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంకట హర చతుర్థి వేడుకలు నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ వినాయకుని గుడి వద్ద మహిళలు పలు పారాయణాలు చేశారు. సంపత్ గణపతి గానామృత కార్యక్రమం నిర్వహించారు. పండితులు గోవింద నామార్చన గావించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, మజ్జి సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక గుబ్బాలమ్మ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన 15 అడుగుల గణపతి విగ్రహాన్ని శనివారం ఘనంగా ఊరేగించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని రూ.1.40 లక్షలతో హైదరాబాద్ నుంచి గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చి 11 రోజుల పాటు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో డప్పులు, బాజాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రౌతులపూడి మండలంలో...

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, ములగపూడి, ఎ.మల్లవరం, ఎస్.పైడిపాల గ్రామాల్లో శనివారం గణపతి విగ్రహాల నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. మండలంలోని ఎస్.పైడిపాల రామాలయం వద్ద, ఎ.మల్లవరం పంచాయతీ కార్యాలయం, రౌతులపూడి, ములగపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను డప్పులు, తీన్‌మార్, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు.



ఏలేశ్వరంలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



తునిలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా తీర పరిశుభ్రత దినోత్సవం



దానవాయిపేట సముద్రతీరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

తొండంగి: మండలంలోని దానవాయిపేట సముద్రతీరంలో శనివారం అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. మత్స్యశాఖ, ఇన్‌కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్, సురక్ష సాగర్ కార్యక్రమం చేపట్టారు. సమితి సభ్యులు, యువత, విద్యార్థులతో కలిసి దానవాయిపేట, నర్సిపేట, తాటియాకులపాలెం బీచ్‌లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ ప్రతినిధి డాక్టర్ ఎస్‌జే ప్రసాద్ మాట్లాడుతూ సముద్రతీరాల్లో కాలుష్య వ్యర్థాల వల్ల సముద్రజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. మత్స్యసంపద క్రమంగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు, సర్పంచ్ మడదా తిరుమల సత్యకుమారి, మడదా పరమేశ్వరరావు, మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు, సొసైటీ ప్రెసిడెంట్ సీహెచ్ భాస్కర్, మడదా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.